
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 46 వ భాగం

### గంగావతరణం – 2

సగరుడి రెండో భార్యకి పుట్టిన అరవై వేల మందీ కపిలుడు కళ్ళు తెరవగానే భస్మం అయిపోయారు కదా? వాళ్ళు అలా ఎందుకయ్యారు అనేదానికి ఇప్పుడు సమాధానం చెప్తున్నాడు.

సీ. కొందఱు కపిలుని కోపానలంబున;
ద్రుందిరి సగరకుమారు లనుచు
నందు రా ముని శాంతుఁ డానందమయమూర్తి;
తొడరి కోపించునే? దుమ్ము నేలఁ
గాక జన్మించునే గగనస్థలంబున? ;
నే సాంఖ్యమతమున నిద్ధమతులు
భవసముద్రము మృత్యుపదమును లంఘింతు;
రా బుద్ధిఁ జేయు పరాత్మభూతుఁ [9-209]

తే. డఖిలబోధకుఁ డతనికి నరసిచూడ
సఖు లమిత్రులు నెవ్వరు? సగరసుతులు
దాము దయచేయు నేరమిఁ దనువులందు
ననలకీలలు పుట్టి నీఱైరి గాక. [9-209.1]

కపిలుడి కోపానికి ఇలా చచ్చిపోయారని కొంతమంది అంటారు కానీ మహావిష్ణువు అవతారమైన కపిలుడు, శాంతంతో ఉండే ఆయనకి అంత కోపం ఎందుకొస్తుంది? దుమ్ము అనేది భూమి మీద పుడుతుంది కానీ ఆకాశంలో పుట్టదు కదా? సాంఖ్య యోగాన్ని ఆపోసన పట్టిన కపిలుడి కోపం రావడం అనేది కల్ల. అటువంటివారికి శతృవులు, మిత్రులు అనేవారుండరు కదా? అసలు ఈ సగర సుతులు అలా చనిపోవడానిక్కారణం వాళ్ళు అంతటి మహర్షికి చేయబోయిన కీడు మాత్రమే. అంటే ఎవరికైనా కీడు చేయడం మనకి మనం చేసుకున్నట్టే.

దీనికి రమణ మహర్షి ఆశ్రమంలో జరిగిన కథ చెప్పుకుందాం. రమణులు ఎవరితోనైనా సరే – పశుపక్ష్యాదులతోసహా – సునాయాసంగా సంభాషించేవారుట. చుట్టూ ఉన్న కోతులూ, ఉడతలూ వాటికి పిల్లలు పుట్టినప్పుడూ, ఆకలివేసినప్పుడూ ఈయన దగ్గిరకి వచ్చి పుట్టిన పిల్లలని చూపించి కూర్చునేవి. అలాంటి రోజుల్లో ఓ సారి ఎవరో ఒకాయన చింతపండు కోసుకుంటూ ఆశ్రమం దగ్గిరలోకి వచ్చినప్పుడు ఓ కోతిని రాయి పెట్టి కొట్టాడుట. ఆ దెబ్బకి కోతి చచ్చిపోతే మిగతా కోతులన్నీ దీని శవాన్ని తీసుకుని రమణుల దగ్గిరకొచ్చి ఏడుస్తూ కూర్చున్నాయిట. మొత్తంమీద కథ తెలిసింది. మహర్షి కోతులని ఊరడిస్తూ చెప్పారుట – చావు అనేది అందరికీ వచ్చేదే, ఏం చేస్తాం? ఆ కొట్టినవాడు కూడా ఏదో ఒకరోజు పోవాల్సినవాడే కదా అని. కాసేపటికి ఆ కోతులు వెళ్ళిపోయాక మళ్ళీ రమణులు మౌనం. మరో కొద్ది రోజులకి తెలిసొచ్చిన విషయం ఏమిటంటే ఆ కోతిని చంపిన మనిషి మంచం మీద పడ్డాడు. జబ్బేమిటో తెలియదు. వాడి పెళ్ళాం పిల్లలూ వచ్చి రమణుల కాళ్ల మీద పడ్డారు "అయ్యా ఇలా జరిగింది. మీరిచ్చిన శాపం కాబోలు, ఇప్పుడు మీరే రక్షించాలి అంటూ." "అబ్బే నేను ఎవర్నీ శపించనేలేదు, నేను అలా చేయనే, నేను చేసినది కోతులని ఓదార్చడం మాత్రమే" అని రమణులు ఎంత చెప్పినా వాళ్ళు వినక మీరే ఏదో ఒకటి చేయాలి అంటూ భీష్మించుకుని కూర్చున్నారుట, చివరిగా రమణులు తన చేతితో విభూది ఇచ్చేవరకూ. అది పట్టుకెళ్ళి ఈయన మొహం మీద రాసాక ఆయనకి కాళ్ళు చేతులూ కదలడం మొదలయ్యాయి. వెనక్కి వచ్చి తాను చేసిన తప్పుకి క్షమాపణ వేడుకున్నాట్ట. ఇక్కడ రమణుల సంగతి చూస్తే ఆయన కోతుల పట్లా, కోతిని కొట్టిన మనిషి పట్లా కూడా నిమిత్తమాత్రులే కదా? ఆయనికిద్దరూ సమానంగానే కనిపించారు. ఇద్దరినీ ఆశీర్వదించనూ లేదు శపించనూ లేదు. ఎవరి కర్మ వాళ్ళని కాటేసింది.

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, తనకి తానే చేసుకున్న కర్మ ఇది. ఆ కర్మ ఇదే జీవితంలో వదిలితే అదో సంతోషం. వదలకపోతే మరో జన్మ ఎత్తాల్సి ఉంటుంది. ఇదే విధంగా సగర పుత్రులు గుర్రాన్నీ కపిలుణ్ణి చూసి అసలేం జరిగిందో తెలుసుకోకుండా, ఈయనే మన గుర్రం దొంగిలించాడంటూ దాడిచేయబోతే వారి కోపం వారినే చంపేసింది. దీనికి రమణుల లాగానే కపిలుడు ఒక సాక్షిగా ఉన్నాడంతే. సగరపుత్రుల విషయంలో జరిగినది ఇదే.

వ. మఱియు సగరుండు గేశిని యందు గన్న పుత్రుం డసమంజసుం డనువాఁడు, సమంజస గుణంబులు లేక పూర్వ జన్మంబున యోగీశ్వరుండై యుండి, సంగ దోషంబువలన యోగభ్రష్టుండయి సగరునకు జన్మించి, జాతిస్మరజ్ఞానంబు గలిగి లోకంబువారలకుఁ దమ వారలకు నప్రియంబగు వర్తనంబునం దిరుగుచు నొక్కనాఁడు. [9-210]

ఇలా జరిగేసరికి ఈ అరవై వేల మందీ ఏమయ్యారో తెలియలేదు సగరుడికి. ఈ కథ ఇలా ఉంటే సగరుడి పెద్ద భార్య కేశినికి అసమంజసుడు అనేవాడు పుట్టి ఉన్నాడు. ఈ అసమంజుసుడు క్రితం జన్మలో యోగీశ్వరుడు కానీ చుట్టూ ఉన్నవాళ్ల సన్నిహిత్యంతో యోగభ్రష్టుడయ్యేడు. అంటే ఎంతటి యోగం అవలంబించి అభ్యాసంతో ఎంతవరకూ పురోగమించినా సత్సంగం అనేది తప్పనిసరి. లేకపోతే ఆ దారిలోంచి భ్రష్టుడవ్వడం తప్పదు. అందుకే చివరి వరకూ ఏ చెడు వాసనలూ దగ్గిరకి రానీయరు అసలైన యోగులనేవారు.

మరి యోగ భ్రష్టులైన వారు మరో జన్మ ఎత్తితే ఏమౌతుంది? వాళ్ళు చేసుకున్న కర్మ ప్రకారం ఎలా పుడతారు? యోగ మార్గం లోంచి బయట జారిపోయినవారు అధోలోకాల్లో పడిపోరు కదా? దీనికి భగవద్గీత లో సమాధానం దొరుకుతుంది మనకి. అర్జునుడు అడుగుతున్నాడు కృష్ణుణ్ణి,

అయతిః శ్రద్ధయోపేతో యోగాచ్చలిత మానసః
అప్రాప్య యోగ సంసిద్ధిం కాం గతిం కృష్ణ గచ్ఛతి

కచ్చిన్నో భయవిభ్రష్ట శ్ఛిన్నాభ్ర మివనశ్యతి
అప్రతిష్టో మహాబాహో విమూఢో బ్రహ్మణః పథి (భగవద్గీత, ధ్యాన యోగం 6.38, 39)

శ్రద్ధతో యోగసాధన ఆరంభించి తర్వాత నియమ రహితం వల్ల యోగ భ్రష్టుడైన వాడు ఎటువంటి గతి పొందుతాడు? కర్మ, ధ్యాన, యోగ మార్గాలనుండి భ్రష్టుడై చెదిరిపోయిన మేఘం లాగా వినాశనం పొందదు కదా?

దీనికి – భగవంతుడు మనకి ఎన్నిసార్లైనా సరే మరోసారి అవకాశం ఇస్తాడని చెప్పడానికా అన్నట్టుండే – కృష్ణుడి అద్భుతమైన సమాధానం చూద్దాం

శ్రీ భగవానువాచ

పార్ధ నైవేహ నాముత్ర వినాశ స్తస్య విద్యతే
నహి కల్యాణకృ త్కశ్చి ద్దుర్గతిం తాత గచ్ఛతి

ప్రాప్య పుణ్యకృతాం లోకా నుషిత్వా శాశ్వతీః సమాః
శుచీనాం శ్రీమతాం గేహే యోగ భ్రష్టోభి జాయతే

అథవా యోగినా మేవ కులే భవతి ధీమతామ్
ఏత ద్ధి దుర్లభతరం లోకే జన్మ య దీదృశమ్

తత్ర తం బుద్ధి సంయోగం లభతే పౌర్వ దేహికమ్
యతతే చ తతో భూయః సంసిద్ధౌ కురునందన

పూర్వాభ్యాసేన తే నైవ హ్రియతే హ్య వశోపి సః
జిజ్ఞ్నాను రపి యోగస్య శబ్దబ్రహ్మాతి వర్తతే

ప్రయత్నా ద్యత మానస్తు యోగీ సంశుద్ధకిల్బిషః
అనేక జన్మ సంసిద్ధ స్తతో యాతి పరాంగతిమ్ (భగవద్గీత, ధ్యాన యోగం 6.40–45)

యోగ భ్రష్టుడైనవాడు ఇహలోకంలో గానీ పరలోకంలో గానీ హీనజన్మలు పొందడు. ఎందుకంటే మంచి పనులు చేసేవాళ్ళు దుర్గతి పొందడం అనేది లేదు కదా? యోగ భ్రష్టుడైన వాడు పుణ్యకర్మలు చేసినవారికి చెందే శుభలోకాలు చేరి అక్కడ కర్మ తీరగానే సదాచార సంపన్నుల ఇంట, ధనికుల ఇంట పుడుతున్నాడు. అయితే అలా పుట్టిన యోగ భ్రష్టుడు తన పూర్వ జన్మ వాసనలు అనుసరించి సిద్ధి పొందడానికి మరింత ఎక్కువగా ప్రయత్నిం మొదలుపెడతాడు. ఆ ప్రయత్నంలో సిద్ధిని పొంది మోక్షం పొందుతున్నాడు.

మళ్ళీ కథలోకి వస్తే, ఈ అసమంజసుడు మంచి కులంలో పుట్టాడు – శుచీనాం శ్రీమతాం గేహే అన్నట్టుగా. మరి ఇంకా పాత వాసనలు పోలేదు కదా? ఇప్పుడు ఏమి చేస్తున్నాడంటే,

చ. వరుస నయోధ్యలోనఁ గలవారల నాడెడు పిన్నవాండ్ర నా
సరయువులోనఁ వైచి జనసంఘముఁ దండ్రియుఁ దిట్టుచుండ వాఁ
డురుమతిఁ గొన్ని ప్రొద్దులకు యోగబలంబునఁ జేసి బాలురం
దిరిగి పురంబు లోపలికిఁ దెచ్చిన నివ్వెఱఁ గంది రందఱున్. [9-211]

అయోధ్యలో పుట్టిన చిన్న పిల్లలనందరినీ సరయూ నదిలో పారేసి చంపేసేవాడు. మొత్తం ప్రజలూ తండ్రీ తిడుతూ ఉండేవారు ఈ పనులకి. కొన్నాళ్లకి తాను చేసే పనులన్నీ తెలిసొచ్చాయి. నది ఒడ్డుకి వెళ్ళి యోగ బలంతో ఆ పిల్లలనందరినీ బతికించి తీసుకొచ్చాడు. ఇదంతా చూసి ప్రజలందరూ నివ్వెర బోయేరు. ఎంత యోగ బలంతో పిల్లల్ని బతికించి తెచ్చినా పోయిన అరవైవేల మందినీ వెతికి తెమ్మని ఇటువంటి అసమంసుజుణ్ణి పంపలేదు సగరుడు.

వ. అయ్యసమంజసుని కొడుకంశుమంతుం డనువాఁడు వినీతుండై తన యొద్దఁ బనులు జేయుచుండు నంత; సగరుండమ్మనుమని నంశుమంతు నశ్వంబు వెదకి తెమ్మనిపంచిన నతండు దనతండ్రుల చొప్పునం జని, వారలు ద్రవ్విన మహాఖాతంబుచొచ్చి, యందు భస్మరాసులపొంత నున్న హయంబుఁ గని, యా సమీపంబు నందున్న కపిలాఖ్యుం డయిన విష్ణుదేవునికి దండప్రణామంబు చేసి, యిట్లని స్తుతియించె. [9-212]

ఈ అసమంజుసుడి కొడుకు – అంటే సగరుడి మనుమడు – అంశుమంతుడనేవాడు తాత దగ్గిర వినయంగా చెప్పిన పనులు చేస్తూ ఉండేవాడు. పోయిన ఆశ్వం ఇంకా రావాల్సి ఉంది యజ్ఞం పూర్తి కావడానికి. అతణ్ణి పంపించాడు సగరుడు ఏమైందో చూసిరమ్మని. అంశుమంతుడు వెళ్ళి కపిలుడి సమక్షంలో ఉన్న గుర్రాన్నీ, తండ్రుల భస్మరాసులనీ చూసి కపిలుడు సాక్షాత్తు విష్ణువని గ్రహించాక, ప్రణామం చేసి ఇలా అన్నాడు.

సీ. మతిచిక్కఁబట్టి సమాధి గౌరవమున;
వాసిగాఁ దనకు నవ్వల వెలుంగు
నినుఁ గానఁ డొకనాఁడు నిన్నెఱుంగునె? బ్రహ్మ;
యజుని మనంబున నవయవముల
బుద్ధి జన్మించిన భూరిజంతువులందు;
హీనులమైన మా కెఱుఁగ వశమె?
తమలోన నీ వుండఁ దా మెఱుంగరు నిన్ను;
గుణములఁ జూతురు గుణములైనఁ [9-213]

తే. గాన రొకవేళఁ జీఁకటిఁ గందు రాత్మ
లందుఁ దెలియరు వెలుపల నమరు బొందు
లరయుదురు దేహధారు లత్యంధు లగుచుఁ
గడిఁది నీ మాయ నెన్నఁడుఁ గడువ లేక. [9-213.1]

మనస్సు స్థిరంగా ఉంచి యోగ సమాధిలో పెంజీకటి కవ్వల ఏకాకృతి వెలుగైన నిన్ను దర్శించడం మానవావయవాలతో పుట్టిన మాకు కుదురుతుందా? మాలోనే ఉన్న నిన్ను గుర్తు పట్టలేకపోతున్నాం. నీ మాయలు దాటేది ఎలా?

కథ ఇంత వరకూ వచ్చాక అంశుమంతుడికీ, వాడి తండ్రులకీ తేడా తెలుస్తోంది కదా? గుర్రం కనబడగానే "ఈయనే మన గుర్రం పట్టుకుపోయాడురా" అనుకుంటూ ఆయనమీద దాడి చేయబోయారు సగరులు. మరి అంశుమంతుడో? వచ్చి గుర్రాన్ని చూసి కూడా ముందు కపిలుడికి ప్రణామం చేసి ఆయనెటువంటివాడో గ్రహించాడు. "గుర్రాన్ని తీసుకోమంటారా" అని అడగట్లేదు. దాని సంగతి తర్వాత చూసుకోవచ్చు. ముందు కావాల్సింది భగవత్కృప. మిగతావి వాటంతటవే వస్తాయి. వచ్చే వ్యాసంలో కపిలుడు అంశుమంతుడితో ఏమంటాడో, తర్వాత కథా చూద్దాం.

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS